
APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 31, జూలై 2026 సంపుటి: 01 సంచిక :64 పేజీలు : 04 వెల: 2-00/-




## 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం

- 2028లో తొలి మాడ్యూల్ ప్రయోగం
- గగన్‌యాన్‌లో కీలక పురోగతి
- స్వదేశీ సాంకేతికతపై ప్రత్యేక దృష్టి
- అంతరిక్ష రంగంలో భారత్‌కు మరో మైలురాయి

న్యూఢిల్లీ, జూలై 30 : భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తొలి స్వదేశీ అంతరిక్ష కేంద్రం భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఐదు మాడ్యూళ్లతో నిర్మించనున్న ఈ అంతరిక్ష కేంద్రంలో తొలి మాడ్యూల్ బీఏఎస్--01ను 2028లో ప్రయోగించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం అంతరిక్ష కేంద్రాన్ని 2035 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర అణుశక్తి, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రాజ్యసభలో తెలిపారు. బీఏఎస్--01 మాడ్యూల్‌కు సంబంధించిన ప్రాథమిక రూపకల్పన సమీక్ష, వ్యవస్థల ఇంజినీరింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ మాడ్యూల్‌కు సంబంధించిన 31 ప్రాథమిక రూపకల్పన పత్రాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఉపవ్యవస్థల రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయని, మానవ అంతరిక్ష కార్యక్రమానికి అవసరమైన నమూనా పరికరాల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని వివరించారు. గగన్‌యాన్ కార్యక్రమంలో కూడా గణనీయమైన పురోగతి సాధించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. మానవులను అంతరిక్షంలోకి తీసుకెళ్లే సామర్థ్యం కలిగిన ప్రయోగ వాహనం, కక్ష్య మాడ్యూల్, వ్యోమగాముల రక్షణ వ్యవస్థ, భూమిపై అవసరమైన మౌలిక సదుపాయాలు, విమాన నిర్వహణ, సమాచార ప్రసార వ్యవస్థలు, వ్యోమగాముల రికవరీ వ్యవస్థల అభివృద్ధిలో కీలక దశలు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

## రాయలసీమలో హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టు




- ₹5,750 కోట్లతో టాటా పవర్ భారీ పెట్టుబడి
- 800 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి
- ఉద్యోగాలు, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు
- అనంతపురంలోనే పవన టర్బైన్‌ల తయారీ

అనంతపురం, జూలై 30 : రాయలసీమలో పునరుత్పాదక ఇంధన రంగానికి మరింత ఊతమిచ్చే దిశగా టాటా పవర్ చేపట్టనున్న రూ.5,750 కోట్ల వ్యయంతో 800 మెగావాట్ల హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుకు రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తితో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక రైతు కుటుంబాలకు దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ 2024లో పెట్టుబడిదారుల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నుంచి రాష్ట్రం బయటపడి, ఇప్పుడు భారీ పెట్టుబడులను ఆకర్షించే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ వేగంగా ముందుకు సాగుతోందని, ఈ ప్రాజెక్టు ఆ దిశగా మరో కీలక అడుగుగా నిలుస్తుందని అన్నారు. ఈ హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టు ద్వారా భారీ స్థాయిలో స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి జరగడంతో పాటు వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. ప్రాజెక్టు వల్ల స్థానిక రైతు కుటుంబాలకు దీర్ఘకాలిక ఆదాయ వనరులు పెరుగుతాయని, ప్రాంతీయ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులో వినియోగించే పవన టర్బైన్‌లను అనంతపురంలోని సుజ్లాన్ తయారీ కేంద్రంలోనే తయారు చేయడం మరో విశేషమని లోకేశ్ తెలిపారు. పెట్టుబడి నుంచి తయారీ వరకు రాయలసీమలోనే జరిగే ఈ ప్రక్రియ "రాయలసీమలోనే తయారీ"కి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. దీంతో స్థానిక పారిశ్రామిక రంగానికి కూడా మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.



## అటవీ అనుభవాల గ్రంథావిష్కరణ

- రాజ్‌భవన్‌లో గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- అటవీ సంరక్షణపై పుస్తకంలో అనుభవాల సమాహారం
- జీవవైవిధ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం అవసరం
- పౌర సేవల అభ్యర్థులకు ఉపయోగపడే గ్రంథమని అభిప్రాయం

హైదరాబాద్, జూలై 30 : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత అటవీ సేవ విశ్రాంత అధికారి, తెలంగాణ మాజీ ప్రధాన ప్రధాన అటవీ సంరక్షణాధికారి, అటవీ దళాధిపతి పరేశ్ కుమార్ శర్మ రచించిన ఫుట్‌ప్రింట్స్ ఇన్ ది ఫారెస్ట్స్ -- మెమోయిర్స్ ఆఫ్ ఎ ఫారెస్టర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయితను గవర్నర్ అభినందించి, ఆయన సేవలను ప్రశంసించారు. భారత అటవీ సేవలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసిన అనుభవాలను ఈ గ్రంథంలో పొందుపరిచినట్లు తెలిపారు. అటవీ పరిరక్షణ, పరిపాలనా అనుభవాలు, ప్రకృతి సంరక్షణలో ఎదురైన సవాళ్లు, వాటి పరిష్కారాలపై ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించినట్లు పేర్కొన్నారు. విధుల్లో ఉన్న అధికారులు, పౌర సేవలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, అటవీ అధికారులు, ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులకు ఈ గ్రంథం ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పరేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ జాతీయ అటవీ విధానం, వాతావరణ మార్పులపై భారత్ తీసుకున్న కట్టుబాట్లకు అనుగుణంగా అటవీ సంపద, జీవవైవిధ్య పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## కన్నెవలసలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన



- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ
- అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం
- స్థానికులతో మమేకమైన వ్యవసాయ శాఖ మంత్రి

శ్రీకాకుళం, జూలై 30 : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాలాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోటబొమ్మాళి మండలం కన్నెవలస గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు, పథకాల ఫలాలు చేరేలా పనిచేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు అన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. కన్నెవలస గ్రామ ప్రజలు తమ పర్యటనకు ఘన స్వాగతం పలికారని మంత్రి తెలిపారు. ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణ తమపై మరింత బాధ్యతను పెంచిందని, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేసామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.



## శ్రీకాకుళం పర్యటనలో జగన్‌కు ఘన స్వాగతం

- విశాఖ నుంచి శ్రీకాకుళం వరకు భారీ జనసందోహం
- తగరపువలస, భోగాపురం, రణస్థలంలో కార్యకర్తల స్వాగతం
- పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
- రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన పర్యటన

శ్రీకాకుళం, జూలై 30 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం పర్యటన సందర్భంగా ఆయనకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలిపింది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు సాగిన పర్యటనలో పలుచోట్ల పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చి స్వాగతం పలికారని పేర్కొంది. ఈ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ విడుదల చేసిన వివరాల ప్రకారం తగరపువలస, భోగాపురం, రణస్థలం ప్రాంతాల్లో వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. రహదారుల వెంట ప్రజలు బారులు తీరగా, పలు ప్రాంతాల్లో నినాదాలతో నాయకుడికి స్వాగతం పలికారని పార్టీ వెల్లడించింది. పర్యటన మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగిందని తెలిపింది. వైఎస్ జగన్ పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ మద్దతు తెలియజేశారని పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ స్పందన పార్టీపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాలపై కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ప్రజల సమస్యలపై ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంది. జగన్ పర్యటనకు లభిస్తున్న స్పందనను చూసి కూటమి నాయకులు ఆందోళన చెందుతున్నారని పార్టీ వ్యాఖ్యానించింది. శ్రీకాకుళం పర్యటనలో వైఎస్ జగన్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక పరిస్థితులపై ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా సమస్యలు, రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న అంశాలపై చర్చించినట్లు వెల్లడించాయి.

అనంత సూర్య
తెలుగువార్త
శుక్రవారం 31 జూలై 2026

# రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి









**• డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ ముట్టడించిన సీఐటీయూ కార్మికులు**
**• పోలీసుల అడ్డంకులు.. బారికేడ్లు తొలగించి కలెక్టరేట్‌కు ర్యాలీ**

పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, స్కూల్ స్వీపర్లు, కంటింజెంట్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో కార్మికులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ వైపు కదిలిన ర్యాలీని బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, కార్మికులు బారికేడ్లను తొలగించి ముందుకు సాగారు. ఈ సందర్భంగా పోలీసులకు, సీఐటీయూ నాయకులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. చివరకు కార్మికులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించగా, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అక్కడికి చేరుకుని వారి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక పరిశ్రమలు, సంస్థల్లో సుమారు 50 లక్షల మంది కార్మికులు కనీస వేతనాలు లేకుండా పనిచేస్తున్నారని ఆరోపించారు. చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి కనీస వేతనాలను సవరించాల్సి ఉన్నప్పటికీ గత 15 ఏళ్లుగా ప్రభుత్వాలు ఆ బాధ్యతను విస్మరించి పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని గార్మెంట్స్, కియా అనుబంధ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. అనేక సంస్థల్లో పీఎఫ్, ఈఎస్ఐ వంటి కార్మిక సంక్షేమ చట్టాలు అమలు చేయడం లేదని, ముఖ్యంగా మహిళా కార్మికులు పనిచేసే గార్మెంట్స్ పరిశ్రమల్లో వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్, గ్రామపంచాయతీ, స్కూల్ స్వీపర్లు, ఏపీకాస్ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా స్పందన లేదని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు, కెవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లాలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించాలన్నా పోలీసులతో పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలను పోలీసులు అణిచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే కార్మిక ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు, కోశాధికారి లక్ష్మీనారాయణ, కెవీపీఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, సీఐటీయూ జిల్లా నాయకులు పైపల్లి గంగాధర్, సాంబశివ, దిల్షాద్, బాబా, ముత్యాలు, బాబ్జాన్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కార్యదర్శి హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ సంఘీభావం తెలిపారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల చలో కలెక్టరేట్

**ఉద్యోగుల రెగ్యులరైజేషన్, వేతనాల పెంపు, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు డిమాండ్**




పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, వేతనాలు పెంచి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద "చలో కలెక్టరేట్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు కలెక్టరేట్‌కు చేరుకుని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని, పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. మెడికల్ లీవులు, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయడంతో పాటు, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచి కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, సమగ్ర శిక్షలో 21 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ జిల్లా అధ్యక్షులు వి. ఓబిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్. రామన్నతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# అండర్-14 క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



**• ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాలు**

అనంతపురం, జూలై 30 అనంత సూర్య: ఆగస్టు 17, 18 తేదీలలో నిర్వహించనున్న అండర్-14 బాల, బాలికల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 29న మండల స్థాయి పోటీలు విజయవంతంగా పూర్తయ్యాయని, విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, వైద్యసేవలు, రవాణా తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీతో పాటు రన్నింగ్ రేసులు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, లాంగ్‌జంప్ వంటి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 10 వేల మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గ స్థాయి విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి, ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) ప్రతినిధులు జిల్లా క్రీడా అభివృద్ధి శాఖకు క్రీడా సామగ్రిని అందజేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మంజుల, ఆర్‌డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, డీఈవో, ఆర్టీసీ ఆర్ఎం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**2.58 లక్షల మందికి రూ.114.65 కోట్లు: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో 2,58,822 మంది లబ్ధిదారులకు రూ.114.65 కోట్ల పింఛన్లు పంపిణీ చేయనుండగా, ఇందుకు 4,831 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. మొదటి రోజే 95 శాతం పంపిణీ పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛనుదారుల ఇంటి నుంచి పంపిణీ కేంద్రం 300 మీటర్లకు మించి ఉంటే కారణాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో మైకులు, టాం టాం, వాట్సాప్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కంట్రోల్ రూమ్‌ల ద్వారా ప్రతి గంటా పంపిణీ పురోగతిని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

# కూటమి పాలనలో అభివృద్ధి.. వైసీపీ హయాంలో విధ్వంసమే





**ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించగా, గత వైసీపీ పాలనలో విధ్వంసం, అరాచకం, అబద్ధ ప్రచారాలే కనిపించాయని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విమర్శించారు. గురువారం బొంతలపల్లి గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, పోలవరం, అమరావతి నిర్మాణంతో పాటు మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసి రైతుల భూములకు భద్రత కల్పించామని, డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ టాస్క్‌ఫోర్స్ సమర్థంగా పనిచేస్తోందన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్, రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.2,202 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ఫైటర్ జెట్ పరిశ్రమ, రిలయన్స్ సోలార్ ప్రాజెక్టుతో పాటు 193 చెరువులు, రెండు రిజర్వాయర్ల నిర్మాణం ద్వారా కృష్ణా జలాలను అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధి









**రూ.12 కోట్లతో ఐటీఐ భవనానికి కియా--ప్రభుత్వం ఒప్పందం**



పెనుకొండ, జూలై 30 అనంత సూర్య: పరిశ్రమలు ఉపాధి కల్పించడమే కాకుండా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా గ్రామాల అభివృద్ధికి కూడా కీలకంగా నిలుస్తున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. గురువారం పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో కియా సంస్థ--రాష్ట్ర ప్రభుత్వం మధ్య రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో కియా, బెల్ వంటి పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.36 కోట్లతో అంగన్‌వాడీలు, ఆ స ం వ ( త ం ల ం, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఐటీఐ కళాశాల ద్వారా స్థానిక యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించి కియా వంటి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. రెండు ఎకరాల్లో నిర్మించే ఈ కళాశాల భవనాన్ని వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, పరిశ్రమల భాగస్వామ్యంతోనే శ్రీ సత్యసాయి జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కియా సంస్థ నిర్మించనున్న ఐటీఐ భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి సమక్షంలో కియా సీఈవో తెం-శాన్ కిమ్, జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. కార్యక్రమంలో కియా సీనియర్ అడ్వైజర్ జంగ్ హో, లైజనింగ్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి, ఆర్డీవో ఆనంద్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, హిందూపురం ఐటీఐ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ






**♦ 2.76 లక్షల మందికి రూ.124.48 కోట్ల పింఛన్లు.. ఇంటి వద్దకే పంపిణీ**

అనంతపురం, జూలై 30 అనంత సూర్య: అనంతపురం జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛను పథకం కింద జూలై--2026 నెలకు సంబంధించిన పింఛన్లను ఆగస్టు 1 నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. జిల్లాలో మొత్తం 2,76,861 మంది పింఛనుదారులకు రూ.124.48 కోట్ల పింఛను నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, ఎయిడ్స్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర అర్హులకు ఈ పింఛన్లు అందజేయనున్నారు. ఆగస్టు 1 (శనివారం) ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ గ్రామం, వార్డు సిబ్బంది పింఛనుదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారు. పింఛనుదారులు తమ ఇళ్ల వద్దే ఉండి పింఛను స్వీకరించాలని అధికారులు సూచించారు. పింఛన్ల కోసం సచివాలయాలు లేదా ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన అవ-సరం లేదని స్పష్టం చేశారు. ఏదైనా కారణంతో మొదటి రోజు పింఛను అందుకోలేని వారు రెండో విడతలో ఆగస్టు 3 (సోమవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత స్వర్ణ గ్రామం లేదా వార్డు కార్యాలయం వద్ద పింఛను పొందవచ్చని అధికారులు తెలిపారు. మొదటి రోజే వీలైనంత వరకు అందరికీ పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహణ






**అంటరానితనం నిర్మూలన, బాల్య వివాహాల నివారణపై అవగాహన**

పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బండ్లపల్లి, బుక్కపట్నం మండలం వెంకటాపురం గ్రామాల్లో గురువారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, డీవీఎంసీ సభ్యులు గ్రామాల్లో అంటరానితనం, రెండు గ్లాసుల విధానం వంటి వివక్షతలను నిర్మూలించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి జీవితంలో ఎదగాలని సూచించారు. మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి గ్రామాల్లో ఐక్యత, సఖ్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. డీవీఎంసీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అవసరమైన సందర్భాల్లో మాత్రమే వినియోగించాలని, సమాజంలో పరస్పర గౌరవం, సామరస్యంతో జీవించాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రజలు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఆర్ఐలు, గ్రామ సచివాలయ సిబ్బంది, పోలీసు అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రూ.220 కోట్లతో రోడ్లు.. రూ.100 కోట్లతో తాగునీటి పథకాలు





**♦ రెండేళ్ల అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే పరిటాల సునీత**

అనంతపురం, జూలై 30 అనంత సూర్య: రాప్తాడు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రూ.220 కోట్లతో రహదారులు, రూ.100 కోట్లతో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సౌకర్యాలు కల్పించిందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామగిరి సోలార్ ప్లాంట్, ఎంఎస్ఎంఈ పార్క్, జీడిపల్లి రిజర్వాయర్--సా-యనీ కాలువ ప్రాజెక్టు, జల్ జీవన్ మిషన్, రేమాండ్స్ పరిశ్రమ వంటి అభివృద్ధి పనులతో పాటు మహిళా సంఘాలకు రుణాలు, పింఛన్లు, 'తల్లికి వందనం', సీఎంఆర్ఎఫ్ సాయం, పా-ఠశాలలు, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డీఎస్పీతో మర్యాదపూర్వక భేటీ . ధర్మవరం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జగన్నాథరాజు అనంతపురంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. చట్ట అమలులో ఎలాంటి రాజీ పడవద్దని, ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడంలో తమ పూర్తి సహకారం ఉంటుందని ఆమె తెలిపారు.

# వైసీపీకి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక



అనంతపురం, జూలై 30 అనంత సూర్య : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురించి ఆధారాలు లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకుంటారని వైసీపీ నాయకులకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు ఎంత మేర వచ్చాయన్నది ఆరా తీశారు. కొందరి ఇళ్లలో ముగ్గురు పిల్లలు ఉన్నా.. తల్లికి వందనం అందిందని సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే నగరంలో జరిగిన అభివృద్ధిపై కూడా సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. ఈ రెండేళ్లలోనే రూ.1290కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామన్నారు. గత ఐదేళ్లలో ఎక్కడైనా ఇలా పనులు చేశారా అని నిలదీశారు. పిచ్చి తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేస్తే.. సీఎం చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. సీబీఎన్ బ్రాండ్ తో మంత్రి నారా లోకేష్ 25లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని.. ఒక్క రాయలసీమలోనే లక్ష కోట్లు హార్టీకల్చర్ హబ్ కు కేటాయించేలా ప్రణాళికలు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. పుట్టపర్తిలో 5వ జనరేషన్ కు సంబంధించిన యుద్ధవిమానాలు తయారు చేసే పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. ఇది ఉమ్మడి జిల్లాకే గర్వకార-ణమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తే.. ఏడాదిన్నర తర్వాత దీనిపై ఏదో జరిగిందని డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టారని వైసీపీ పై విమర్శలు గుప్పించారు. ఒక అబద్ధాన్ని పదే పదే నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి నారా లోకేష్ బహిరంగ సవాల్ కు రమ్మంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదన్నారు. కేవలం మెగా డీఎస్సీ మాత్రమే కాకుండా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చారన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి చేరేలా బడుల్ని మార్చారన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపులు, టాయిలెట్స్ వద్ద ఉంచి అవమానించారన్నారు. అదే ఈ రోజు ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పిస్తూ.. ప్రతి నెల 1వతేదిన వేతనాలు అందజేస్తున్నారన్నారు. నాడు-నేడు పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చేస్తున్న రద్ధాంతాన్ని ఇప్పటికైనా మానుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ దలవాయి రమాదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, కాశీ విశ్వేశ్వర దేవాలయ ఆలయ చైర్మన్ నరేంద్ర చౌదరి, టిడిపి మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బోయపాటి బాలప్ప, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, క్లస్టర్ల ఇంచార్జ్ లు సరిపూటి రమణ, వన్నూరప్ప, గోపాల్ గౌడ్, టిడిపి నాయకులు సరళ, చరిత, వడ్డే భవాని, దాడి శ్రీనివాస్ చౌదరి, మున్వర్, నల్లాని మనోహర్, ఓంకార్ రెడ్డి, వసుంధర, సుజాతమ్మ, అయేషా నేహా, కదిరప్ప, వెంకట సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎదుగుదల లేని చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి




**ఐసీడీఎస్ అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం.. ముగ్గురికి చార్జ్ మెమోలు**

అనంతపురం, జూలై 30 అనంత సూర్య: అంగన్వాడీ కేంద్రాల్లో ఎదుగుదల లేని, పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని 2,302 అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదల, బరువు, ఎత్తు, రక్తహీనత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలను తప్పనిసరిగా ఎన్ఆర్సీకి పంపించాలని, తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రోత్ మానిటరింగ్‌లో నిర్లక్ష్యం వహించిన కళ్యాణదుర్గం సూపర్వైజర్ సుధారాణి, కనేకల్ సీడీపీఓ నాగమణి, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవికి చార్జ్ మెమోలు జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. రెండు రోజుల్లో అన్ని కేంద్రాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న పిల్లల సంఖ్యను సున్నా శాతానికి తీసుకురావాలని, డ్రాప్‌అవుట్ అయిన చిన్నారులను తిరిగి అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో ఖచ్చితమైన డేటా నమోదు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహం జరిగినట్లు సమాచారం అందితే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ షాహిదా, డీఆర్డీఏ పీడీ శైలజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సీడీపీఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రతే లక్ష్యం: ఎస్పీ సతీష్ కుమార్



పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా వ్యాప్తంగా శక్తి టీం ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్ యాప్‌లు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాల భద్రతపై విద్యార్థులు, మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల దుష్పరిణామాలు, పోక్సో చట్టం, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణపై వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియో గించాల్సిన పోలీస్ (100/112), మహిళల హెల్ప్‌లైన్ (181), అగ్నిమాపక సేవలు (101), సైబర్ మోసాల ఫిర్యాదులు (1930), బాలల సహాయ నంబర్ (1098) గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, యువత, విద్యార్థులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని శక్తి టీం సభ్యులు తెలిపారు.

# వైసీపీకి రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి తప్పదు



అనంతపురం, జూలై 30 అనంత సూర్య : వైసీపీ నాయకులు రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కొంటారని.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 33వ విడుతలో 37మందికి రూ.49.69లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశా-రు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ నాయకులు, లబ్ధిదారులు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 692మందికి రూ.6.90కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశామన్నారు. గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ ఎంత మందికి సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేశారో చెప్పాలన్నారు. 692మందిలో 450 మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని.. మైనార్టీల పట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం ఇది అని అన్నారు. వైసీపీ నాయకులకు ప్రజలకు అధికారం ఇస్తే ఎలాంటి కార్యక్రమాలు చేయరని.. మేము చేస్తామంటే చూసి ఓర్వలేరన్నారు. నిత్యం ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారని.. ప్రజలు వారిని చూసి అసహ్యించుకుంటున్నారన్నారు. ఆ ప్రభుత్వ హయాంలో రూ.3500కోట్లు మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని.. ఇందులో రోజుకి ఒకరి పేరు వెలుగులోకి వస్తోందన్నారు. వరుసగా జైలు బాట పడుతున్నారన్నారు. వారు ఇలాగే కుట్రలు, కుతంత్రాలు చేస్తే మరింత పతనమవుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనంత సూర్య
శుక్రవారం 31 జూలై 2026

# మధ్యాహ్న భోజన పథకం అద్భుతం



అనంతపురం, జులై 30 అనంత సూర్య : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం చాలా అద్భుతంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ స్టూడెంట్స్ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ హై స్కూల్లో భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమర్ యాదవ్ మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు గత వైసిపి ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని అనేక ఉద్యమాలు చేస్తే.. గత ప్రభుత్వం తమ పైన కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. కరువు జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల వలన పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వం గ్రహించి విద్యా ప్రతి ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో.. విద్యార్థులందరూ పాఠశాల రావాలని ఈ మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ మధ్యాహ్న భోజనం మెనూలో కోడిగుడ్లు, చిక్కిలు, అరటి పండ్లు, రాగిజావా, వెజిటేబుల్ పలావ్, ఆకుకూరల పప్పు, మినరల్ వాటర్, సన్న బియ్యంతో అన్నం రుచికరంగా ఉందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకొని ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంత రుచికరంగా వడ్డిస్తున్నందుకు విద్యార్థులు అందరూ కృతజ్ఞతలు తెలిపారని తెలిపారు. ఈ పరిశీలనలో జేవీసీ నేతలు విజయ్, బీసీ రాజేష్, ప్రశాంత్, గోవర్ధన్, గోవింద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఐపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల డిమాండ్




పుట్టపర్తి, జూలై 30 అనంత సూర్య: హిందూపురం వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం పుట్టపర్తిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దళిత సంఘాల నాయకుల కథనం ప్రకారం, పరిగి మండలం బీచిగానిపల్లి గ్రామానికి చెందిన ఓ బాలింత హిందూపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనకు సంబంధించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరేందుకు వెళ్లిన బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణతో హిందూపురం వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఈ ఘటనను ఖండిస్తూ సూపర్ హాస్పిటల్ నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన నాయకులు, సీఐపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఘటనపై ఉన్నతాధికారులు నిష్పక్షపాత విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# రైతుల పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి: అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం, జూలై 30 అనంత సూర్య: ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే భరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతులపై భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకం అమలు చేశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని నిలిపివేసిందని విమర్శించారు. పరిశ్రమలకు భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం రైతుల కోసం పంటల బీమా ప్రీమియం చెల్లించలేదా అని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణం 8.48 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 2.60 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని తెలిపారు. ఇంకా సుమారు 6 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభం కాలేదన్నారు. జూలై 31తో బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగియనున్న నేపథ్యంలో ఇంకా 1.90 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించలేదని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని ఆరోపించిన ఆయన, వర్షాభావం కారణంగా ఈ ఖరీఫ్‌లో వేరుశనగ సాగు తీవ్రంగా తగ్గిందన్నారు. సాధారణంగా 3.64 లక్షల ఎకరాల్లో సాగు జరిగే వేరుశనగ ఈసారి కేవలం 45 వేల ఎకరాలకు పరిమితమైందని చెప్పారు. ప్రభుత్వం పంట మార్పిడిని సూచిస్తోందని, అయితే ఇప్పటికే వేరుశనగకు ఎకరాకు రూ.640 చొప్పున బీమా ప్రీమియం చెల్లించిన రైతుల పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వేరుశనగకు బదులుగా కంది వంటి పంటలు సాగు చేస్తే ప్రీమియం సర్దుబాటు ఎలా ఉంటుందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి రైతుల తరఫున పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, కందులు, జొన్నలు, అలసందలు, ఆముదం, కొర్రల సాగుకు ఉచితంగా విత్తనాలు అందించాలని కోరారు. అలాగే రైతు కూలీలు వలసలు వెళ్లకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు విస్తృతంగా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# శ్రీ త్రిలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

- భక్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: హరీష్ బాబు



ధర్మవరం, జూలై 30 అనంత సూర్య: ధర్మవరం పట్టణంలోని 9వ వార్డు లింగశెట్టి పాళ్యంలో ఉన్న శ్రీ త్రిలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు గురువారం ఎన్డీఏ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలు, భక్తులకు అవసరమైన మౌలిక సౌకర్యాలపై కమిటీ సభ్యులు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హరీష్ బాబు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి, భక్తుల సమస్యల పరిష్కారానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వినతిలో పేర్కొన్న అంశాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్డీఏ కార్యాలయానికి వచ్చిన వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆలకించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హరీష్ బాబు తెలిపారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

## - పిలుపునిచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్

**- కదిరిలో బీజేపీ అసెంబ్లీ సంస్థాగత సమావేశం విజయవంతం**
**- సార్ కార్యక్రమంపై -2లకు సమగ్ర అవగాహన**
**- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విధివిధానాల వివరణ**





కదిరి, జూలై 30 (అనంత సూర్య): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సర్ కార్యక్రమానికి సంబంధించిన కదిరి అసెంబ్లీ స్థాయి సంస్థాగత సమావేశం గురువారం కదిరి పట్టణంలోని ఇంపీరియల్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. సమావేశంలో బిఎల్ఎ -2లు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధులు, కార్యాచరణ ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. ముఖ్య అతిథులుగా శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్ స్వామి, జిల్లా ఇన్‌చార్జ్ కునిగిరి నీలకంఠ, కదిరి మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్. పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసే దేవానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎల్ఎ-2లు చేపట్టాల్సిన పనులు, అమలు చేయాల్సిన విధివిధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరంగా తెలియజేశారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తలుపుల గంగాధర్, కిసాన్ మోర్చా హార్టికల్చర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సామాల కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కసెట్టి రామ్మోహన్, కదిరి పట్టణ అధ్యక్షులు పీట్ల రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, బిఎల్ఎ-2లు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి, సర్ కార్యక్రమం సమర్థవంతమైన అమలుకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు.

# గుంజేపల్లి గ్రామ రెవెన్యూ పొలంలో వ్యవసాయ శాస్త్రవేత్త బృందం పర్యటన



- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

ముదిగుబ్బ,జులై 30, అనంత సూర్య: ముదిగుబ్బలో గుంజేపల్లి గ్రామ రెవెన్యూ పొలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు శాస్త్రవేత్తలు సాగుచేసిన రైతులు కంది పంటను పరిశీలించారు జూన్ నెలలో వర్షాధారంగా సాగు చేసిన వేరుశనగ కంది మరియు ఆముదం బె ట్టకు గురికాకుండా ఉండేందుకు పొటాషియం నేట్రే ట్ -5- గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయవలెనని తెలిపారు భూమి సాల్ల మధ్యలో కలుపు లేకుండా చూసుకోవాలని సూచించారు బెట్ట ప్రభావం తగ్గించడానికి వరుసల మధ్యలో మొక్కల సంఖ్యను తగ్గించాలని తెలిపారు నీటి సదుపాయం ఉన్న రైతులు ఒక తడి పంటకు వేసుకోవాలని తెలిపారు ఆగస్టు నెలలో వర్షం వచ్చినట్లయితే కంది పెసర సజ్జ మరియు జొన్న పంటలు సాగు చేయడానికి అనుకూలమని తెలిపారు ఈ కార్యక్రమంలో కదిరి వ్యవసాయ పరిశోధన స్థాన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ భాస్కర్ రెడ్డి డాక్టర్ రమేష్ నాయక్ పుట్టపర్తి ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య ముదిగుబ్బ మండల వ్యవసాయ అధికారి పి రవీంద్ర వ్యవసాయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో పందుల స్వైర విహారం..

**పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం.**



పామిడి,జులై30,అనంత సూర్య: పామిడి గ్రామపంచాయతీలో ప్రధాన కూడల్లతో సహా అన్ని ప్రాంతాలలోనూ పందులు సైరవిహారం చేస్తున్నాయి. ఇలాంటి వాటిని అదుపు చేయవలసిన పంచాయితీ యంత్రాంగం మాత్రం నిద్రావస్థలో ఉన్నట్టుగా కనిపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకవైపు యావత్ ప్రపంచానికే పెను ప్రమాదంగా మారినటువంటి కరోనా మళ్లీ తన ప్రభావం చూపించడం ప్రారంభించడంతో భయం గుప్పెట్లో బతుకుతున్న ప్రజలు, అనేక రోగాలను ప్రబలించేందుకు ప్రధాన కారణమైనటువంటి పందుల ప్రత్యక్షంగానే స్వైర విహారం చేస్తుంటే వారి ఆరోగ్యం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్న ప్రతిరోజు వారి దృష్టికి ఈ విషయం కనిపిస్తున్న పంచాయతీ యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంలో అలసత్యం వహించడంలో ఏమి ఆంతర్యం ఉందో, అధికారుల ధోరణి అర్థం కాని పరిస్థితిలో ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి ఇలాంటి వాటిని కట్టడి చేసి గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజల కోరుతున్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405